క్లుప్తంగా

ఏఈఎల్‌సీ చర్చి వార్షికోత్సవం



అమరావతి: స్థానిక పట్నంమాలపల్లి ఏఈఎల్‌సీ చర్చి నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేసి దీవెనలు అందించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మా విజయసాగరబాబు, పట్నంమాలపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



సత్తెనపల్లి: పాత్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు కీర్తిశేషులు జె.విజయుడు జయంతి సందర్భంగా పాత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు మంగళవారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. గత 15 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు కస్తూరి, కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ ఏఎస్ఆర్ జక్కం తెలిపారు. సంస్థ ఉపాధ్యక్షులు గఫూర్, సభ్యులు, సంఘ సేవకులు జి.జాన్‌బాబు, న్యాయవాది జి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి క్రికెట్ పోటీలు

నకరికల్లు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య మంగళవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రతిభను చాటిన 14జట్లు మండలస్థాయిలో తలపడతాయన్నారు. మండలస్థాయిలో గెలుపొందిన జట్లను నియోజకవర్గస్థాయిలో ఎంపిక చేస్తామన్నారు.

నేడు పునీత అంతోని ఆలయ వార్షిక తిరునాళ్ళ

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలో పునీత అంతోని వారి ఆలయ వార్షిక తిరునాళ్ళ ఈ నెల 17వ తేదీన జరుగుతుందని ఆలయ విచారణ గురువులు నాగోతు చిన్నయ్య తెలిపారు. సుమారు 119 సంవత్సరాల చరిత్ర గల చర్చిలో ప్రతి ఏడాది జనవరి 17న తిరునాళ్ళ నిర్వహించటం ఆనవాయితీ. తిరునాళ్ళ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. గ్రామస్తులు చర్చి తిరునాళ్ళ రోజున ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

సివిల్స్ కోచింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

అచ్చంపేట: నిరుపేద కుటుంబానికి చెందిన కన్నెధార నీలవేణి హైద్రాబాద్‌లోని ఎక్సలెన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకుంటోంది. కోచింగ్‌కు ల్యాప్‌టాప్ అవసరం కావడంతో రూ.40వేలు ఖరీదు చేసే ల్యాప్‌టాప్‌ను స్నేహహస్తాలు గౌరవాధ్యక్షురాలు మామిళ్లపల్లి విజయలక్ష్మి మంగళవారం అందించారు. ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు ఎదగలేని అనేకమంది విద్యార్థులకు స్నేహ హస్తాలు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షులు తుమ్మా శౌర్రెడ్డి, స్నేహ హస్తాలు ప్రతినిధి తాయి కరిముల్లాబాబు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



దుర్గి: మండలంలోని ఆత్మకూరు గ్రామ పరిధిలోని బుగ్గవాగు సమీపంలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎస్ కోటయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తన సిబ్బందితో అసాంఘిక చర్యలకు అనువుగా ఉన్న ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. దానిలో భాగంగా బుగ్గవాగు సమీపంలో పేకాట నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.31వేలు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట, నాటుసారా తయారీ, అక్రమ మద్యం కలిగి ఉండటం, బెట్టింగ్‌లకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- స్వగ్రామాలకు వచ్చిన వారితో కళకళలాడిన పల్లెలు
- ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు
- ఆకట్టుకున్న రంగవల్లులు, కిటకిటలాడిన ఆలయాలు
- కనుమ సందర్భంగా గోమాతకు ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి సంబరాలు పట్టణం, మండలంలో అంబరాన్నంటాయి. పల్లెలన్నీ సంక్రాంతి సందడితో కళకళలాడాయి. పల్లె తల్లి తన పిల్లల రాకతో మురిసిపోయింది. ఇళ్లన్నీ మామిడి తోరణాలు, ప్రత్యేక అలంకరణతో పండుగ కళ సంతరించుకుంది. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఇంటి ముందు గొబ్బెమ్మలతో అందమైన రంగు రంగుల ముగ్గులు వేశారు. వేకువ జామునే హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల సందడితో చిన్నారులు కేరింతలు కొట్టారు. ప్రతి ఇంట పిండివంటల ఘుమఘుమలు బంధువుల రాకతో ఆనందం వెల్లివిరిసింది. కొత్త అల్లుళ్లు, కోడళ్లు, బంధు మిత్రులతో ఇళ్లన్నీ సందడిగా ఉన్నాయి. చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. సోమవారం సంక్రాంతి ఆనందోత్సాహాలతో నిర్వహించారు. పితృదేవతలకు పూజలు చేశారు. మంగళవారం కనుమ పండుగను వైభవంగా జరుపుకున్నారు. రైతులకు అండగా, చేదోడు వాదోడుగా నిలిచే తమ పశువులను, ఎడ్ల బండ్లు, తాము ఉపయోగించే నాటు బండ్లు, వ్యవసాయ పనిముట్లు శుభ్రపరిచారు. ఆరుగాలం రైతులతో పాటు ఎంతో శ్రమపడే జోడెద్దులు, ఇంటి నిండా పాడి ఇచ్చే గోవులను ప్రత్యేకంగా పూజించారు. పట్టణంలోని వడవల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయం, గడియార స్తంభం సెంటర్లోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశాలలో గోమాతకు పూజలు నిర్వహించి పచ్చిక తినిపించారు.

నకరికల్లులో సంక్రాంతి వేడుకలు

నకరికల్లు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో సంక్రాంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొండపై వెలసిన చెంచులక్ష్మీ ఆదిలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి విశేషపూజలు చేశారు.



పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

అర్చకులు మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

మండలంలో సంక్రాంతి వేడుకలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను తెలుగువారి సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిర్వహించే సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. హరిదాసు కీర్తనలతో పాటు ముంగిళ్ళను అందమైన రంగువల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. పలు గ్రామాల్లో పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు, స్లో సైక్లింగ్, చిన్నారులకు లెమన్ అండ్ స్పూన్ వంటివి నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పండుగ వేడుకల్లో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కనుమ పండుగను నిర్వహించారు.

విజేతలకు బహుమతులు

అచ్చంపేట: సంక్రాంతి వేడుకలలో భాగంగా మండలంలోని చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చింతగుంట్ల హనుమంతరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయంగా ప్రతి సంవత్సరం పండుగను జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షులు తుమ్మా శౌర్రెడ్డి, సభ్యులు తాయి కరిముల్లాబాబు, ఉప సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



కోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆలయం ఎదుట మకర జ్యోతి



పెద్దమక్కెనలో ప్రత్యేక అలంకరణలో మల్లికార్జున స్వామి

కమనీయం గోదాదేవి కళ్యాణం



గోదాదేవి రంగనాయక స్వాముల కళ్యాణం



హాజరైన భక్తులు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో గల రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం గోదాదేవి, రంగనాయక స్వాముల కళ్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ముందుగా గోదాదేవి, రంగనాయక స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు పీతాంబరాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోకి తీసుకొచ్చారు. తదుపరి పూజలు నిర్వహించి, పూజారుల నేతృత్వంలో పరిణయోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రాంగణంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కార్యనిర్వహణ అధికారి రంగిశెట్టి సూర్యనారాయణ నేతృత్వంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పట్టణంలోని గోశాలలో గోమాతకు పూజలు



విజేతలకు బహుమతులు పంపిణీ

భక్తిశ్రద్ధలతో మకరజ్యోతి

క్రోసూరు: మకర సంక్రాంతి పురస్కరించుకుని మండల కేంద్రంలోని వాసవీ కన్యాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదుట ఆలయ కమిటీ సోమవారం రాత్రి మకరజ్యోతి వెలిగించటం జరిగింది. భక్తులు, ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొని మకరజ్యోతిని పూజించారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

మండలంలో సంక్రాంతి వేడుకలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను తెలుగువారి సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. హరిదాసు కీర్తనలతో పాటు ముంగిళ్ళను అందమైన రంగువల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. పలు గ్రామాల్లో పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు, స్లో సైక్లింగ్, చిన్నారులకు లెమన్ అండ్ స్పూన్ వంటివి నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పండుగ వేడుకల్లో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా చాగంటివారిపాలెంలో ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు నిర్వాహకులు మారూరి రామచంద్రారెడ్డి, వనమాల బ్రహ్మారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డిలు అందించారు. మంగళవారం కనుమ పండుగను నిర్వహించారు.



చాగంటివారిపాలెంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

వైఎస్సార్‌సీపీ జెండా స్తంభాన్ని విరగ్గొట్టిన దుండగులు

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న వైఎస్సార్‌సీపీ జెండా స్తంభాన్ని గుర్తు తెలియని దుండగులు సోమవారం విరగొట్టారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీకి బలంగా పట్టు ఉండటాన్ని జీర్ణించుకోలేని తెలుగుదేశం పార్టీ శ్రేణులే ఈ దురాగతానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఓసీ ఏరియాలో ఉండే జెండాను గతంలోను విరగ్గొట్టారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మరలా ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శిరిగిరి గోపాలరావులు పరిశీలించి ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



తొండపిలో విరిగి ఉన్న వైఎస్సార్‌సీపీ జెండా

వైఎస్సార్‌సీపీ నాయకులు కాటయ్య, సైదా, జానీ బాషాలు ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శాంతి మార్గమే దైవ మార్గం



ఎంఎం ఉజమ్మిల్‌ను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు



పల్నాడు జిల్లా స్థాయి ఇస్తమాకు హాజరైన ముస్లిం సోదరులు

పీఎం ఉజమ్మిల్

మాచవరం: శాంతి మార్గమే దైవ మార్గమని బెంగళూరుకు చెందిన హజరత్ మౌలానా పీఎం ఉజమ్మిల్ సాహెబ్ తెలిపారు. మండల కేంద్రమైన మాచవరంలోని జీకే పబ్లిక్ స్కూల్‌లో ముస్లిం సోదరుల సహాయ, సహకారాలతో సోమవారం పల్నాడు జిల్లా స్థాయిలో ఇస్తమా కార్యక్రమం నిర్వహించారు. జల్సా ఇత్తేహాదెమిల్లత్, ఇస్లెఖ్ బాలె రమాజన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరత్ మౌలానా పీఎం ఉజమ్మిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరు కలిసిమెలిసి ఉండాలని, దైవప్రవక్త మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని తెలిపారు. ఒకరి పట్ల మరొకరు స్నేహభావంతో ఉండి సమాజంలో దైవభక్తితో ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణంలో, అల్లా సన్నిధిలో గడపాలని సూచించారు. అనంతరం ఇస్లామిక్ మోడల్ స్కూల్‌లో ఖురాన్ చదివిన విద్యార్థులకు బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేల మందికి పైగా ముస్లిం సోదరులు హాజరయ్యారు. హాజరైన ప్రతి ఒక్కరికి భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం మౌలానా ఉజమ్మిల్‌ను స్థానిక ఎస్ఐ సమీర్ బాషాతోపాటు ముస్లిం మత పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో ముఫ్తీ అబ్దుల్ బాసిత్ సాహెబ్, మౌలానా అబ్బాస్ ఖాన్ సాహెబ్, మహ్మద్ షర్‌ఫుద్దీన్ హుదవి సాహెబ్, ముజాహిదుల్ ఇస్లాం సాహెబ్, అజ్మతుల్లా ఖాన్ సాహెబ్, ఆఫీస్ సాహెబ్, సిలార్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తా

- పొగలు రావటంతో భయాందోళనకు గురైన స్థానికులు
- తప్పిన పెను ప్రమాదం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో రోడ్డు ఎక్కుతుండగా గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న ఆటో బోల్తా పడిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్యాస్ సిలిండర్ల లోడుతో వస్తున్న ఆటో ప్రధాన రహదారి నుంచి రైల్వే స్టేషన్ వెళ్తుండగా మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనాలు అడ్డంగా ఉండటంతో వాటిని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఆటో బోల్తా పడటంతో ఒక్కసారిగా ఆటోలో నుంచి పొగలు రావటంతో స్థానికులు పరుగులు తీశారు. ఆటో డ్రైవర్ ఆటోలో ఇరుక్కుపోవటంతో కొంత సమయానికి పొగలు తగ్గటంతో స్థానికులు ధైర్యం చేసి ఆటోను పైకి లేపి ఆటో డ్రైవర్‌ను బయటకు తీశారు. ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలు అయ్యాయి. సిలిండర్లు అన్నీ రహదారిపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు ధైర్యం చేసి సిలిండర్లను తిరిగి ఆటోలో లోడు చేసి పంపించటంతో ఆ ప్రాంతంలోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గ్యాస్ సిలెండర్లు లీక్ కాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది.



ఆత్మీయ సమ్మేళనం

అచ్చంపేట: స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలులో 1987 నుంచి 1992 వరకు పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులంతా సోమవారం పాఠశాల ఆవరణలో కలిశారు. తమ చిన్ననాటి విషయాలను జ్ఞప్తికి తెచ్చుకుని ఒకరితో ఒకరు కష్టసుఖాలను పంచుకున్నారు. వివిధ హోదాలలో స్థిరపడిన వారంతా తమ హోదాలను మరచి చిన్ననాటి చిలిపి చేష్టలను మననం చేసుకున్నారు. వారికి చదువులు చెప్పిన గురువులను పిలిచి సన్మానం చేశారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు పి.చలపతిరావు, సైన్స్ టీచర్ ఎస్.పాలకాలరాజు, ఎవన్ మార్కు, డ్రాయింగ్ టీచర్ ఎస్.నాగమల్లేశ్వరిలను ఘనంగా సత్కరించారు.

సర్పంచ్, ఎంపీటీసీలకు శిక్షణ

ముప్పాళ్ళ: గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు సంబంధించిన ప్రజా ప్రణాళిక ఉద్యమం, పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25పై అన్ని గ్రామాల సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఫంక్షనల్ సిబ్బందికి ఈ నెల 17, 18 తేదీల్లో శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో పీ పుట్టారెడ్డి మంగళవారం తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమానికి పంచాయతీరాజ్ కమిషనర్ గూగుల్ మీట్ ద్వారా హాజరవుతారన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

జ్వాలాముఖి అమ్మవారికి రజత శఠగోపం సమర్పణ

అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో జ్వాలాముఖి అమ్మవారికి సోమవారం రజత శఠగోపం, పళ్ళెం సమర్పించారు. అమరావతికి చెందిన వస్త్ర వ్యాపారస్తుడు కొప్పురావూరి శివసత్య రాజేంద్రప్రసాద్, రాజ్యలక్ష్మి దంపతులు స్వామివారి ఆలయంలోని జ్వాలాముఖి అమ్మవారికి రజత శఠగోపం, పళ్ళెం సమర్పించారు. సుమారు 560 గ్రాముల బరువుతో రూ.43 వేలు విలువైన రజత శఠగోపం, పళ్ళెం సోమవారం ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి ఈవో వేమూరి గోపినాథశర్మకి అప్పగించారు. తొలుత దాతలు అమరేశ్వరునికి అభిషేకం, బాలచాముండేశ్వరి, జ్వాలాముఖి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ పాలకమండలి సభ్యుడు నేరెళ్ళ హనుమంతరావు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఈవో వేమూరి గోపినాథశర్మకి రజత శఠగోపం, పళ్ళెం అందిస్తున్న దృశ్యం

అయ్యప్ప తిరు ఆభరణాల ఊరేగింపు

పిడుగురాళ్లరూరల్: అయ్యప్ప నగర్‌లోని అయ్యప్ప దేవస్థానం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో వేంచేసియున్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి తిరు ఆభరణాల ఊరేగింపు, పడిపూజ మహోత్సవ కార్యక్రమం సంక్రాంతిని పురస్కరించుకొని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వీకే సతీష్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామునే స్వామివారికి సుప్రభాత సేవ, మహాగణపతి హోమం, నవ విధ అభిషేకాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు తిరు ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరు ఆభరణాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం భక్తులకు మకర జ్యోతి దర్శనం ఇచ్చారు. అనంతరం పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుండా శ్రీనివాసరావు, అధ్యక్షులు అంచూరి శ్రీనివాస్‌రెడ్డి, సీతరామాంజనేయులు, మణికంఠ, కపిలవాయి గోపాలరావు, వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏసు మార్గం అనుసరణీయం



లూర్థుమాత గుహను ప్రారంభించి మాట్లాడుతున్న బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య

మాచర్ల రూరల్: వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన లూర్థుమాత దేవాలయంలో లక్షలాది రూపాయలతో లూర్థుమాత గుహను నిర్మించటం శుభపరిణామమని గుంటూరు బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రాయవరం గ్రామంలో మాజీ ఎంపీపీ సోమకూర రాజారెడ్డి ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించిన గుహను బిషప్ ప్రారంభించి మాట్లాడారు. 200 సంవత్సరాల క్రితం నిర్మించబడిన లూర్థుమాత దేవాలయం ఎంతో విశిష్టమైందన్నారు. ఇలాంటి చర్చి ప్రాంగణంలో గుహను నిర్మించటం ఆనందకరమన్నారు. ఏసు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి తోటివారికి సాయమందించినప్పుడే మనం నిజమైన భక్తులమన్నారు. కార్యక్రమంలో విచారణ గురువులు రత్నబాబు, ఏపూరి రాయపరెడ్డి, కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి, మర్రెడ్డి, అనిల్‌కుమార్, ఎలీషా, గుడిపెద్దలు బొమ్ము నాగరాజు, రాజారావు, భాస్కర్, జోజయ్య, సీహెచ్ వెంకటేశ్వర రెడ్డి, జోజి తదితరులున్నారు.

చిన్నారులకు వైద్యసేవలు

పిడుగురాళ్లరూరల్: చలికాలంలో చిన్నారులను జాగ్రత్తగా చూడాలని చిన్న పిల్లల వైద్య నిపుణులు గుర్రం కృష్ణకాంత్ అన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను పరిశీలించి జ్వరం, జలుబు, దగ్గు, ఆయాసం, రక్త హీనత, శ్వాస ఇబ్బందులు, బరువు తక్కువ వంటివి పరిశీలించి మందులను అందజేశారు. కార్యక్రమంలో జూలకంటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.